క్లుప్తంగా...

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సైబరాబాద్ హోంగార్డులు

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు సైబరాబాద్ పరిధిలోని హోంగార్డులు వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం ఆయనను నగరంలో సైబరాబాద్ హోంగార్డుల అధ్యక్షులు అశోక్‌కుమార్, డాక్టర్ కొత్వాల్ దయానంద తదితరులు కలిశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారని అశోక్ కుమార్ తెలిపారు.

బాస్కెట్‌బాల్ టోర్నీలో ఓక్రిడ్జ్ ప్రతిభ



రాయదుర్గం: అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థుల బాస్కెట్‌బాల్ జట్టు ప్రతిభ చాటింది.నగరంలో సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఈ బాస్కెట్‌బాల్ టోర్నీని నిర్వహించారు. ఈ పోటీలలో ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలకు చెందిన గ్రేడ్–10 జట్టు రన్నరప్‌గా నిలిచింది. జట్టు సభ్యులకు ట్రోఫీతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మంగళవారం ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ దీపికారావు, వైస్ ప్రిన్సిపల్స్ రుక్మిణీకుమార్, శ్వేతా వర్మ, స్పోర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ రాజ్‌కుమార్, కోచ్ కిషోర్ పిడికిటి విద్యార్థులను అభినందించి ట్రోఫీని అందించారు.

'సైబర్ సురక్షా'పై అవగాహన



సైబర్ సురక్షా కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ విద్యార్థులు

గోల్కొండ: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి శ్రీనివాసు అన్నారు. సైబర్ సొసైటీ ఆఫ్ ఇండియా జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వారు మంగళవారం సైబర్ సురక్షా ఫర్ రూరల్ పీపుల్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు మోసపోయే వారిలో అన్ని రకాల వయస్సు, ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారని, అయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు సైబర్ నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలన్న విషయంపై విద్యార్థులతో తాము అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.

రోడ్లను వెంటనే బాగు చేయాలి

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇప్పటికే శిథిలావస్థకు చేరిన రోడ్లలో జోరుగా కురుస్తున్న వర్షానికి గోతులు ఏర్పడ్డాయన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

అన్నదానం



గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

వర్షాకాలం వచ్చిందంటే డెంగీ, మలేరియా, డయేరియా, వైరల్ జ్వరాలు లాంటి రోగాలు వస్తాయి. ఈ ఏడాది నెలన్నర ఆలస్యంగా వచ్చిన వర్షాకాలం అప్పటి వరకు కురవాల్సిన దానికంటే అదనంగా వర్షాలు నాలుగు రోజుల్లోనే కురిశాయి. దీంతో అనేక కాలనీల్లో వరదలు, అక్కడక్కడ నీరు నిలిచి ఉండటం, పారిశుద్ధ్యం సరిగ్గా జరగక ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.

- దోమల వ్యాప్తికి అడ్డుకట్ట
- వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు



నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్, శానిటేషన్ ఇన్‌చార్జి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నివారణ, రోగాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డిని 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది.

◆ **సాక్షి: నార్సింగి మున్సిపాలిటీ విస్తీర్ణం, జనాభా ఎంత..?**

✱ కమిషనర్: నార్సింగి మున్సిపాలిటీ విస్తీర్ణం 60.06 చదరపు కిలోమీటర్లు ఉండగా.. అందులో 20 చదరపు కిలోమీటర్లు గండిపేట చెరువు ఉంది. మున్సిపాలిటీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 25,209 మంది ఉండగా.. వాస్తవంగా 96 వేలకు పైగా ఉంటారు.

◆ **సాక్షి: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాలనీలు, వార్డులు ఎన్ని ?**

✱ కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో పాత 6 గ్రామపంచాయతీలు, 60 వరకు కాలనీలు, 18 వార్డులు ఉన్నాయి.

◆ **సాక్షి: మున్సిపాలిటీ పరిధిలో గత వర్షాల వల్ల నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలు ఉన్నాయా..?**

✱ కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, బాలాజీనగర్ కాలనీ లోతట్టు ప్రాంతం కావటంతో నీరు నిలిచేది. ఇటీవల డ్రైనేజీ సామర్థ్యం పెంచటం, సీసీ రోడ్లు వేయటంతో సమస్య తీరింది. కోకాపేట చెరువు నిండిపోవటం, తూముల నుంచి తక్కువగా నీరు వెళ్తుండటం, చెరువు కట్ట తెగిపోయే పరిస్థితి రావటంతో సకాలంలో గుర్తించి ఓ చోట కట్టను తెంపి నీటిని దిగువకు వదిలేయాల్సి వచ్చింది.

◆ **సాక్షి: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు, వారి జీతబత్యాలకు ఏడాదికి ఎంత ఖర్చు చేస్తున్నారు..?**

✱ కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో కేవలం పారిశుద్ధ్య పనులకే 132 మంది ఉన్నారు. వారి జీతాలతో పాటు 4ట్రాక్టర్లు, 2 ఆటోలు, 2జేసీబీలు, ఒక స్వీపింగ్ మిషన్, ఒక గల్పర్ మిషన్‌ల నిర్వహణకు ఏడాదికి రూ. 3కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాం.

◆ **సాక్షి: దోమల నివారణ, దుర్వాసన వచ్చే చోట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

✱ కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ప్రతి వార్డులో వారానికోసారి ఫాగింగ్ చేయించటం, వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకోవటం, నీరు నిలిచిన చోట ఆయిల్‌బాల్‌లను వేయటం, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లటం చేస్తున్నాం.

◆ **సాక్షి: మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీల వివరాలు చెప్పండి ?**

✱ కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా 75.05 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, 4 కిలోమీటర్ల ఓపెన్ డ్రైనేజీ, 15.75 కిలోమీటర్ల కచ్చా డ్రైనేజీలు ఉన్నాయి. వాటిల్లో ఎక్కడా జామ్‌లు కాకుండా తరచూ క్లీనింగ్ చేస్తున్నాం.

◆ **సాక్షి: వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలను వివరించండి ?**

✱ కమిషనర్: వర్షాకాలంలో అనేక వ్యాధులు ప్రజలకు ప్రబలుతాయి. వాటిని అరికట్టేందుకు ప్రధానంగా దోమల వ్యాప్తిని నివారించటం, వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకోవటం, రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా వెంటనే తొలగించటం, బ్లీచింగ్ చల్లడం లాంటి చర్యలను తీసుకుంటున్నాం.

విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోన్ అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్

రాజేంద్రనగర్: సామాజిక భద్రతతో పాటు సమాజంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ జోన్ అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్.రమ్మీపెరుమాల్ పిలుపునిచ్చారు. చదువుకునే పాఠశాల, తల్లిదండ్రులతో కలిసి ఉండే ఇంటితో పాటు పరిసరాల్లో అసమానతలకు విద్యార్థులు గురవుతున్నట్లు గుర్తించి వారికి కావాల్సిన భద్రత, మనోస్థైర్యం ఇవ్వడానికి సైబరాబాద్ పోలీస్ కృషి చేస్తోందన్నారు. మంగళవారం వేంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ హైస్కూల్ ఆవరణలో చైల్డ్ సేఫ్టీ క్లబ్ పైలెట్ ప్రాజెక్టును నిర్వహించగా.. ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ మధు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివప్రసాద్, ఆదిత్య ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నిరంజన్, డైరెక్టర్ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కొంపల్లి జగదీష్, సమ్మెట సౌజన్య, జైపాల్, ఎస్.శకుంతల తదితరులున్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



మహాధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: ఆగస్టు 9,10వ తేదీల్లో జరిగే కార్మిక సంఘాల ఐక్య మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, ప్రధాన కార్యదర్శి ఒరుగంటి యాదయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం రాజేంద్రనగర్ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను కోడ్‌లలోకి మార్చి చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని విమర్శించారు. సమ్మె చేసుకునే హక్కు సంఘం పెట్టుకునే హక్కుల కార్మికుల న్యాయం కోసం పోరాడే హక్కును తొలగించి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి కార్మికులు బ్రతుకేలా ఈ చట్టాలను సవరించడం సరికాదన్నారు. ఏఐటీయూసీ మాజీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, దత్తునాయక్, జైపాల్‌రెడ్డి, ఎస్.మల్లేష్, నర్సింహారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి ఎం.ఎ.రియాజ్, ఆఫీస్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



కార్యక్రమంలో ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు అలోక్‌సేత్ వెల్లడించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్, రౌండ్ టేబుల్ ఇండియా సంయుక్తంగా మూడు తరగతి గదులు, అండర్ గ్రౌండ్ తాగునీటి సంపును నిర్మించి విద్యార్థులకు తాగునీటి వసతి కూడా కల్పించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అలోక్‌సేత్, సంస్థ ప్రతినిధులు గౌరవ్‌గార్గ్, కేదర్ కస్తూరే, నిర్మలలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అధునాతన పద్ధతిలో ఆధునీకరిస్తూ విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, గండిపేట మండల ఎంఈఓ రామ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

64 మంది రౌడీషీటర్లకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

అత్తాపూర్: సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే ఆనందోత్సవమైన జీవితం ఉంటుందని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి అన్నారు. డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 64 మంది రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. హసన్‌నగర్, చింతల్‌మెట్, సులేమాన్‌నగర్, నౌనెంబర్ తదితర ప్రాంతాలకు చెందిన రౌడీషీటర్లను పిలిపించి వారు చేస్తున్న పనులను తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా నేరాలకు పాల్పడినట్లు తెలిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



ప్రసాద్ (ఫైల్)

శంషాబాద్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని రాళ్లగూడ రోడ్డు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో నివసిస్తున్న సుజాత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు ప్రసాద్ (19) ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. కాగా పని నిమిత్తం రెండు రోజుల క్రితం గండిపేటలో పనిచేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..



బొక్క రమేష్ కుమార్ (ఫైల్)

- విమానాశ్రయంలోని జీఎంఆర్ ఫౌండేషన్‌లో ఏడాదిన్నరగా వంటమనిషిగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నగిరికల్ మండలం చల్లగుల్ల గ్రామానికి చెందిన బొక్క రమేష్ కుమార్ (27) పనిచేస్తున్నాడు. కాగా జూలై 15 తన మేనమామతో ఫోన్ మాట్లాడాడు. అనంతరం తిరిగి ఫోన్ చేయడంతో స్విచ్ఆఫ్ వచ్చింది. దీంతో అతడు జీఎంఆర్ ఫౌండేషన్ అధికారులను సంప్రదించాడు. వారు రమేష్‌కుమార్ జూలై 5న జీతం మొత్తం తీసుకుని సంస్థ నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు గొడుగుల వితరణ



ట్రాఫిక్ పోలీసులకు గొడుగులను అందజేస్తున్న పొన్న రమేష్

మణికొండ: వర్షంలో తడుస్తూ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సమస్యను అర్థం చేసుకున్న ఓ వ్యక్తి వారికి గొడుగులను అందజేసి తన బాధ్యతను నిర్వర్తించాడు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఇటీవల కురుస్తున్న వర్షంలో తడుస్తూ విధులు నిర్వహిస్తుండటంతో విషయం గమనించిన వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న రమేష్ మంగళవారం వారందరికీ సీఐ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా గొడుగులను అందజేశారు. ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో బల్దియా కమిషనర్ పర్యటన



శాతం చెరువును పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రొనాల్డ్ రాస్, ఎమ్మెల్యే తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లతో పాటు చెరువు, నాలాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తామని బల్దియా కమిషనర్ రొనాల్డ్ రోస్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యేతో కలిసి కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఆయన నదీమ్ కాలనీకి ప్రతిఏటా ముంపునకు గురి చేస్తున్న శాతం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ శాతం చెరువుకు జరుగుతున్న తూము ఆధునీకీకరణను చూపించారు. టోలిచౌకి, రియాసత్ నగర్ తదితర ప్రాంతాలు కూడా ముంపునకు గురవుతున్నాయని టోలిచౌకి రుమాన్ హోటల్‌తో పాటు ఆ ప్రాంతంలోని ఎన్నో షాపుల్లో వరదనీరు చొచ్చుకుని వస్తుందని ఆయన అన్నారు. అనంతరం ఆయన అహ్మద్ కాలనీలోని నాలాను పరిశీలించారు. ఈ నాలా పై స్లాబ్ లేకపోవడం వల్ల స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. నాలా వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆయన అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ వెంకటేష్, కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్ తదితరులున్నారు.

స్లాటర్ హౌస్ నిర్మాణానికి కృషి చేస్తా

జియాగూడ: స్లాటర్ హౌస్‌ను ఆధునీకరించి నిరుపేదలకు ఉపాధి కలిగే విధంగా కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ అరె కటిక సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, చర్మకాష్ సంఘం అధ్యక్షుడు శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శన్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా జియాగూడ కమేళాపై వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. మేకల మండిని ఆధునీకరించకపోవడం వల్ల నానాటికీ సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఇతర మండీలను ఆధునీకరించినట్లే జియాగూడ మేకల మండిని ఆధునీకరించి దీనిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏకే ట్రస్ట్ చైర్మన్ దివాకర్‌లాల్, ప్రధాన కార్యదర్శి గురుదాస్, సంఘం ప్రతినిధులు హరికిషన్, సాయి, రాఘవేందర్, నరేందర్, హరిలాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కురిసిన భారీ వర్షాలకు ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తున్నామని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ 22వ డివిజన్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ మేరకు కాలనీలో తాగునీటి, విద్యుత్ తదితర సమస్యలు ఏర్పడ్డాయని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి అనంతరం సిబ్బందిని పిలిపించి మరమ్మతు పనులను చేయించారు. మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ కాలనీలు, బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు.

వార్డు కార్యాలయాల పరిశీలన



కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న, ఉపకమిషనర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వార్డు కార్యాలయాలను దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌లు మంగళవారం పరిశీలించారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదులు, సంబంధిత అధికారులు చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి నేరుగా పరిశీలించాలన్నారు. ప్రతి ఫిర్యాదు దారుడికి పూర్తి సమాచారాన్ని త్వరితగతిన అందించాలన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాజేంద్రనగర్: ఆదర్శ విద్యాలయ ఉన్నత పాఠశాలలో చైల్డ్ సేఫ్టీ క్లబ్ కార్యక్రమం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా ఐపీఎస్ అధికారిణి రేష్మి పెరుమాల్, ఏసీపీ గంగాధర్, రాజేంద్రనగర్ పోలీస్ సేష్టన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, వాట్సప్, ఫేస్‌బుక్ వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్, రాంబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- ఆయా ఆర్టీసీ డిపోల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో వద్ద .. ఎమ్మెల్యే గాంధీ, సాయిబాబా, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం, సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రక నిర్ణయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు గచ్చిబౌలి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో డిపో ఉద్యోగులు, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనుకోవడం, 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిర్ణయించడంతో అందరికీ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చారిత్రక నిర్ణయాల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో ఉద్యోగులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కార్మికుల పక్షపాతి అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం సందర్భంగా మియాపూర్‌లోని ఆర్టీసీ డిపో–1, డిపో–2 లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఈ నిర్ణయం దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఆర్టీసీ ఉద్యోగస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్ వద్ద ..

మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో కారిడార్ విస్తరణ చేపట్టాలని సీఎం నిర్ణయం తీసుకున్న సందర్భంగా మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.